

'అన్నయ్యా, పాడమంటావా?'

జవాబు చెప్పలేదు. కిటికీలో కూర్చుని బయట ప్రకృతిని చూస్తున్నాడు. సుందరమయిన సాయంత్రం. ప్రొద్దు వాలింది. ఆకాశంలో అక్కడక్కడ అప్పుడే ఒకటి రెండు నక్షత్రాలు కనపడుతున్నాయి. క్రింద తోటమాలి యింకా పని చేస్తున్నాడు. బయట రోడ్డు మీద కార్లు వెడుతున్నాయి.

ఆకాశం ఎక్కడో దూరంగా భూమిని కలుసుకున్నది. అటుకేసి చూస్తున్నాడు అన్నయ్య. మాలతీలత వాడిశరీరాన్ని తాకుతున్నది.

'అన్నయ్యా, ఈ పాట ఎవరు వ్రాశారో కాని చాలా బాగుంది.' అన్నాను మెల్లగా, 'ఆనందం అర్ణవమయితే' అనే పాటపాడుతూ. వాడు మాట్లాడలేదు. అదేమిటో గంటలకొలబడి అలాగే కూర్చుంటాడు. దేన్నిగురించి ఆలోచిస్తాడో—హృదయంలో ఆందోళనేమో అంటే, దాని కవసర మేమీ లేదు.

కొంచెం సేపాగి—

'సీతా, ఆపాట బాగుందికదూ!' అన్నాడు.

నాకు తెలుసు వాడి కే పాట యిష్టమో.

'పాడనా!' అన్నాను.ఇకమళ్లీ జవాబు లేదు. అప్పుడప్పుడు మహా చిరాకేసేది. 'ఆనందం అర్ణవమయితే-' అనేదే పెద్దగా పాడటం మొదలెట్టాను. వింటున్నాడో, లేదో నా కేం తెలుస్తుంది!

'వినకపోతే పాడటం కూడా దేనికి!' అన్నాను, పాట ఆపి. 'లేదమ్మా, వింటున్నాను పాడు.' అన్నాడు.

మా అన్నయ్యమాట అంటే నా కెంతో ఆనందం. అమృతధారలు వర్షించినట్టుంటుంది. వాడు నన్ను పాడమని అడగడమే భాగ్య మనిపించేది. వెంటనే పాట అందుకున్నాను.

పాట అయిపోయింది. ఆకాశంలోకి చంద్రుడు వచ్చేశాడు. వెన్నెల అన్నయ్య ముఖంమీదపడి ఏదో ఔదార్యాన్ని, సౌమ్యతని ప్రతిఫలించింది. శాంతం వుట్టిపడుతూ వుంటుంది. అలాగే వాడి ముఖంలోకి చూస్తూ నిలబడిపోయాను, దీపం వెలిగించాలన్న విషయం సైతం మరిచిపోయి.

కొంచెం సేపటికి అంతా చీకటిగా వున్నట్టు తోచింది. దీపం వెలిగించాను.

'అబ్బ, ఎప్పుడూ ఏమిటా ఆలోచన-' అన్నాను విసుగ్గా. నవ్వుతూ నావైపు చూశాడు. ఇప్పటికీ కళ్ళకు కట్టినట్లుంది. వెన్నెల చిలికినట్టే వుంటుంది వాడు నవ్వితే.

దగ్గరకు వచ్చి, నా చేయి పుచ్చుకుని, 'అన్నం తిందామా, సీతా' అన్నాడు.

నరసింహమూర్తి

'ఇందాకటి నుంచీ అన్నంగురించే ఆలోచిస్తున్నావా? అంతా నాటకం!' అన్నాను క్రిందికి పరుగెత్తుతూ.

'అమ్మా, అన్నం పెట్టవే అన్నయ్యకూడా వస్తాడు.' అన్నాను, అమ్మదగ్గర కెళ్ళి.

'రండి పెడతా, మీ నాన్న వచ్చేదాకా వుంటారేమో అనుకున్నాను.'

'కాదులే పెట్టు, రారా అన్నయ్యా.'

అన్నం తినేశాము.

'అన్నయ్యా, యివాళ మేడమీద పడుకుందాంరా' అన్నాను.

'అలాగే, కాస్సేపు చదువుకోవద్దూ?'

'బయట కూర్చుని చదువుకో. టేబిలు బయట వేస్తాను. అయినా ఒక్కరోజుకి చదువు లేక పోతే యేం?'

'త్వరగానే ముగిస్తాలే. టేబిలు బయట వెయ్యి, యిప్పుడే వస్తాను.' అని అలా కొంచెం దూరం నడిచిరావటానికి వెళ్ళాడు. వాడి కదో అలవాటు-అన్నం తినగానే నడవటం.

బల్లా, పుస్తకాలూ అన్నీ బయట అమర్చాను. బల్ల పక్కగా మంచాలు వేశాను. అన్నయ్య వచ్చికూర్చుని పుస్తకాలు తీసి చదవటం మొదలెట్టాడు. వుద్యోగం చేస్తూన్నా విద్యార్థికంటె ఎక్కువగా చదివేవాడు. వాడి కెన్ని తెలుసని! వాడు చదువుతూంటే అలాగే చూడాలనిపించేది. ఏ పనిచేసినా అంతముచ్చటగా వుండేది.

దాదాపు పదికాగానే పుస్తకంమూసేసి 'లైటు ఆర్పేయనా, సీతా' అన్నాడు. తమాషాకు నేనేం మాట్లాడలేదు. వెంటనే బల్లా, పుస్తకాలూ లోపల పెట్టేసి, లైటు ఆర్పి పడుకున్నాడు.

'అన్నయ్యా, వెన్నెల బాగుంది కదూ?' అన్నాను.

'దొంగా, నిద్రపోలేదూ? ఇందాకా ఎందుకు మాట్లాడలేదు! నేను మాత్రం ఎందుకు మాట్లాడాలి?' అన్నాడు.

'అబ్బో! నువ్వు మాట్లాడకపోతే ఏం ఫర్వాలేదు. నీ మూతివిరుపులకి కూడా జడుస్తే ఎట్లా?' అన్నాను. అన్నానేకాని నిజంగా వాడికి కోప మొచ్చిందేమోనని భయమేసింది. అలా మెల్లిగా మంచం పక్కగా వెళ్ళి ముఖం లోకి చూశాను. నవ్వుతున్నాడు. నేను లొంగి పోయాననుకుంటాడని గబుక్కున వెనక్కి తిరిగాను. నా చేయి పట్టుకుని—

'సీతా, ఇవాళ భలేకథ చదివాను-చెప్పనా?' అన్నాడు.

'ఆఁ, చెప్పు.'

కథ మొదలుపెట్టాడు. కథలు చెప్పటంలో మంచి ఆరితేరినవాడు. చెపుతూనే వున్నాడు. నా కెప్పుడు నిద్రపట్టిందో తెలియదు. పొద్దున్న కళ్లు తెరిచేసరికి దాదాపు ఏడుగంట లవుతుంది. సూర్యుడి కిరణాలు నామీద పడుతున్నాయి. మాఅన్నయ్య అప్పుడే లేచి స్నానంచేసి వచ్చి కూర్చుని చదువుకుంటున్నాడు. నాకే అసహ్యమనిపించింది, ఇంత ఆలస్యంగా లేవట మేమిటని. అమ్మా, నాన్నా కోప్పడరు కనక కాని, పెళ్ళి కాని పిల్లని యింత పొద్దెక్కే దాకా లేవక పోతే ఎట్లా?

నేను స్నానం మొదలైనవి ముగించుకుని వచ్చేటప్పటికి చాలా సేపయింది. అన్నయ్య మామూలు పరిస్థితిలో వున్నాడు. పుస్తకం ఒడిలో వుంది. ఎటో చూస్తున్నాడు. ఇక చచ్చిగీపెట్టినా పలకడు. ఈ ఆలోచన దేనినిగురించో కాని, రాత్రింబగళ్ళు లేవు.

కుర్చీలోంచి లేచి వెళ్ళి కిటికీచువ్వలు పట్టుకు నుంచుని బయటకు చూస్తున్నాడు. ఇంతలో బయట ఏడుపు వినిపించింది. అన్నయ్య చలనం లేకుండా నుంచుని చూస్తున్నాడు. నాకుమాత్రం వుండబట్టలేదు. బయటకు వెళ్ళి చూశాను. ఎవరో ఏడుస్తున్నారు. పాపం ఎవరు పోయారో! పట్నవాసాల్లో పక్కింటివాళ్ల సంగతే తెలియదు. ఇంకా కొంచెం ముందు కెళ్ళి చూసేసరికి శవం కనపడ్డది. పాడెమీద కెక్కిస్తున్నారు శవాన్ని.

గబగబా లోపలికి వచ్చి—

'అన్నయ్యా, పక్కింట్లో ఎవరో పోయారు పాపం. శ్మశానానికి తీసుకెళుతున్నారు" అన్నాను.

ఏమీ మాట్లాడలేదు.

'చూడెట్లా రా. అదుగో వెళుతున్నారు' అన్నాను పిట్టగోడమీదికి వంగి. మా అన్నయ్య కూడా వచ్చాడు. వెడుతూన్న శవాన్ని అదే

దీక్షగా చూడటం మొదలుపెట్టాడు. ఆ శవం మలుపు తిరిగి అదృశ్యమైంది.

అన్నయ్య వెనక్కు తిరిగి మేడమెట్లు దిగటం ప్రారంభించాడు. ఎక్కడికి అని నే నడగనూ లేదు. వాడు చెప్పనూ లేదు. నేను కూడా వాడివెంట దిగాను. క్రమంగా గదులన్నీ దాటి, యింటితోట దాటి రోడ్డుమీది కొచ్చేశాము. ఒకళ్ళతో ఒకళ్లు మాట్లాడుకో లేదు. ముందు చూపుతప్ప వెనక నే నొస్తున్నట్లు గమనించాడో లేదో వాడు. అలాగే వెళుతున్నాం. శవం తిరిగిన మలుపే మేమూ తిరిగాం. అప్పుడింకా ఎనిమిదయి వుంటుంది. రోడ్లమీద జనం అంత కిక్కిరిసి లేరు. అసలు మాదో మారుమూల. అలాపోయి శ్మశానం దగ్గిర ఆగాడు అన్నయ్య. నాకు గుండెలు గుబుక్కు మన్నాయి. అదే మొదటి తడవ-నేను శ్మశానంలో శవం ఉండగా చూడటం. శవాన్ని దింపారు. పక్కనే కొడుకు కాబోలు ఏదో బ్రాహ్మలు చెప్పినట్లు చేస్తున్నాడు. మా అన్నయ్య మరీ దగ్గరకు పోతున్నాడు. గుండెలు భయంగా కొట్టుకుంటున్నా వాడికి దగ్గరగా నడుస్తూ వెళ్ళాను మమ్మల్ని ఎవరూ అడ్డగించలేదు. శవంతోపాటు వచ్చిన వాళ్ళంతా అక్కడ పాకలాంటి దాంట్లో కూర్చున్నారు. శవానికి దగ్గరగా కాటికాపరి కట్టెలు పేరుస్తున్నాడు- ఒకదానిమీద ఒకటి. చూస్తూ నిలుచున్నాం యిద్దరం. కొంతసేపటికి మంత్రాలు చదవటం అయిపోయింది. శవాన్ని పాడెమీదనుంచి ఎత్తారు. భయం జాస్తి అవుతున్నది. కాని చూడా లనిపించింది. అన్నయ్య చెయ్యి పట్టుకుని వెనకగా నిల్చున్నాను. అన్నయ్య మాత్రం చలించకుండా తదేకదీక్షగా చూస్తున్నాడు. శవాన్ని ఎత్తి కట్టెలమీద పడుకోబెట్టారు. కాళ్లు రెండూ కట్టేసి వున్నాయి. ఒంటిమీద కప్పినగుడ్డ లాగేశారు. మొలకో ధోవతిలాంటిది మాత్రం వుంచారు. వరసనే కాళ్ళదగ్గరనుంచి పెద్దపెద్ద మొద్దులు పెట్టటం ప్రారంభించారు. భయం మరీ జాస్తి అయింది. అన్నయ్య చెయ్యి గట్టిగా పట్టుకున్నాను. ఇప్పుడు తలుచుకుంటే నవ్వొస్తుంది. దాదాపు శవం అంతా కట్టెలు పెట్టేశారు. ఎక్కడా ఏ భాగం కనపడటం లేదు.

కొడుకు నిప్పుకుండ తీసుకుని మూడుసార్లు ప్రదక్షిణం చేశాడు. బ్రాహ్మలు మంత్రాలు చదువుతున్నారు. ప్రదక్షిణ లయిన తర్వాత మెల్లగా తలదగ్గర కట్టెలమీద కొన్ని పిడకలు పెట్టి వాటిమీద నిప్పుకుండ బోర్లించేశాడు కొడుకు. దానిమీద కొంచెం కిరసనాయిలు పోసి నట్లున్నారు. ఏమో అంత జ్ఞాపకం లేదు. భగభగమని అంటుకున్నాయి కట్టెలు. కొంచెం సేపటికల్లా పెద్దమంట అయింది. చురచుర మని మండుతున్నాయి. నా కళ్ళవెంట నీళ్లు గిర్రున తిరిగాయి. కళ్లు వాటంతటవే మూసుకున్నాయి. కళ్ళు తుడుచుకోవాలని కూడా అనిపించలేదు. అన్నయ్య మాత్రం మొదట్లో ఎలా వున్నాడో అలాగే చూస్తూ నుంచున్నాడు. మంటలు మరింత ప్రజ్వలించాయి. కొడుకు కొంచెం దూరంగా కూర్చుని, కుండ బద్దలు కొట్టి, బ్రాహ్మడు మంత్రాలు చదువుతుంటే ఏదో కర్మ చేస్తున్నాడు. వివరంగా చూడలేక పోయాను. శవంమీది మంటలు నా హృదయాన్ని కదిలించేస్తున్నాయి. ఒకటి రెండు కట్టెలు కిందికి దొర్లితే పెద్దగడతో కాటికాపరి పైకి నెడుతున్నాడు.

కొడుకు చేయవలసిన పని అయిపోయింది కాబోలు. పాకలోకి వెళ్ళి కూర్చున్నాడు. వాళ్ళలో ఎవరో—

'ఇంక పోదాం, పదండి. అయిపోయిందిగా అంతా' అన్నాడు అతిదీనంగా.

"కాస్సేపుండి వెడదాం' అన్నాడు కొడుకు.

'ఏంవుంటే ఏం లాభం-అంతా అయిపోయిం తర్వాత' అన్నాడు మరొకాయన.


"అంతే, క్షణంలో కొచ్చేది తెలియదు. వెధవ జీవితం ఎంతసేపు!'

వాళ్లున్నంతసేపూ మేమూ వున్నాం. వాళ్ళు బయలుదేరిన తరవాత 'అన్నయ్యా, వెడదాం రా' అన్నాను.

మాట్లాడకుండా వెనక్కు తిరిగా డన్నయ్య.

మెల్లగా యింటికి చేరుకున్నాం.

మా అమ్మ ఎదురుచూస్తున్నది. 'ఎక్కడికెళ్లావు నాయనా, యివాళ ఆఫీసు లేదూ?' అంది.



గబుక్కున తలెత్తి 'వున్నా' అని లోపలికి పోతున్నాడు.

'అయితే టైము కాలేదా ?' అన్నది అమ్మ మళ్ళీ.

'అయిందమ్మా!' అన్నాడు.

'అన్నానికి రా. సీతా, పోయి కంచం పెట్టు-వస్తున్నా' అని తోటవైపు వెళ్ళింది.

అన్నయ్య మేడమీదకి వెళ్లి ఎంతసేపటికీ రాలేదు. దాదాపు అరగంట అయింది. అమ్మ పిలుచుకు రమ్మంటే పైకి వెళ్ళాను. కుర్చీలో కూర్చున్నాడు. నిజంగా ఎంత నిశితమయిన చూపులు !

'అన్నయ్యా, అమ్మ రమ్మంటోంది, రా, అన్నం పెట్టింది !' అనగానే—

'ఆఁ- వస్తున్నా. ఆఫీసు టైము కాలేదు'

'అయింది- అప్పుడే పదకొండున్నర కావస్తుంటే !'

'పద, వస్తున్నా' అని అన్నానికొచ్చేశాడు.

అప్పుడనిపించింది నాకు-బహుశా అన్నయ్య రోజూ దీన్నిగురించే ఆలోచిస్తాడేమో నని. నేను చాలా కథలు విన్నాను. ఇలా ఆలోచించి ఆలోచించి కొందరు సన్యాసు లైపోయారని. చాలా భయమేసింది- అన్నయ్య కూడా అలా అయిపోతాడేమోనని. అప్రయత్నంగా నాకు తెలియకుండానే దుఃఖం వచ్చింది.

అన్నయ్య ఆఫీసుకి వెళ్ళాడు. నా కదే ఆలోచన. వాడు తిరిగి వచ్చేదాకా కడుపులో ఏదో గుబులు. వాడిలాగే ఎప్పుడూ వుంటే ఎట్లా, అనిపించింది. అన్నిపుస్తకాలూ తిరగేశాను. ఆరోజున ఏవీ రుచించలేదు. ఒక్కపాట పాడుకుందామన్నా గొంతు రాలేదు. ఇల్లంతా ఒకటే అలంగం తిరిగేశాను. అన్నయ్య వచ్చేదాకా అంతే. నాలుగయింది. ఇంకో అరగంటలో అన్నయ్య వస్తాడు. ఎక్కడలేని సంతోషం వచ్చింది.

ఇంతలో 'సీతా, సీతా' అని కేకేశాడు అన్నయ్య. ఒక్క గంతేసి బయటి కెళ్లాను. అన్నయ్య చేతిలో ఏదో పుస్తకం ఉంది.

'ఇదుగో, యెంకిపాటల పుస్తకం కూడా తెచ్చాను. నాకు పాడి వినిపిస్తావా?'అన్నాడు.

వాడు పాడమనాలే గాని పాడటాని కేముంది-

'ఆ-పద' అన్నాను. ఇద్దరం మేడమీది కెళ్ళాం.

అన్నయ్య కోటు విప్పి వంకెకు తగిలించి, కూజాలో మంచినీళ్లు తాగి కుర్చీమీద కూర్చున్నాడు.

'ఇవాళ పేపరు చూడలేదే, తీసుకురా. చూసేసి షికారు పోదాం.'

'మరి పాడమన్నావుగా!'

'నీకు ఒక్క ఎంకిపాటకూడా రాదుగా మరి-చదివింతరవాత పాడు.'

'సరే' అని కింద కెళ్ళి పేపరు తెచ్చి యిచ్చాను.

పేపరుచూస్తూ, 'మంచి హిందీ ఫిల్ము వచ్చిందే! వెళదామా సీతా?' అన్నాడు వాడు.

'తప్పకుండా పోదాం, రా' అన్నాను.

'అయితే-త్వరగా ముస్తాబై, రా' అన్నాడు.

'మరి అన్నం?'

'వచ్చిన తర్వాత పెడుదువుగాని లే.' పట్టరాని సంతోషం వచ్చింది. మా అన్నయ్య సంతోషంగావుంటే చాలు, వా డేది చెయ్యమంటే అది చేస్తాను.

'అమ్మా- అన్నయ్యా, నేనూ సినిమా కెడుతున్నామే! అన్నం తర్వాత తింటాం లే.' అని అరుచుకుంటూ పోయి అమ్మతో చెప్పాను.

'సరే, వెళ్ళిరండి' అన్నది మా అమ్మ.

'నువ్వు మేలుకో నక్కరలేదు. మేం పెట్టుకు తింటాం లే' అన్నాను.

'అయిందీ, మీ నాన్న భోజనం త్వరగా అయితేగా నిద్ర!' త్వరత్వరగా ముస్తాబయ్యాను. మా అన్నయ్యకు పోకలాట్టే లేవు. అందువలన వా డెప్పుడూ సిద్ధమే.

'పోదాం, రారా!'

'పెద్ద దొరసానిలా తయారయావే! ఇంత సింగార మెందుకే!' అన్నాడు నవ్వుతూ.

'పెద్ద-నీకు లేనట్టు' కొంచం కోప మొచ్చినట్లు చూశాను.

'నిన్ను చేసుకునేవాడెవడో భరించలేడే.'

పెళ్ళి అనగానే ఎందుకో శరీరం గగుర్పొడిచింది. పెళ్ళి కాగానే అన్నయ్యా, నేనూ యింత కులాసాగా వుండటానికి వీలవుతుందా?

'కొంచెంసేపు అలా బీచికి వెళదామా?'

'కారుమీద పోదాం. అరే-నాన్నగారు తీసుకెళ్లారు కారు' అన్నాను.

'దగ్గరేగా! నడచిపోదాం. బీచినుంచి టాక్సీమీద పోదాం లే.'

'సరే పద.' ఇద్దరం నడిచి వెళ్లాం. మమ్మల్ని చూస్తే అందరికీ అసూయ పుడుతుం దనుకునే దాన్ని. ఒక్కమాట అనేవాడు కాదు అన్నయ్య నన్ను. నా డెక్కడి కెళితే అక్కడికి తీసు కెళ్లే వాడు. వాడు పొరపాటున ఒక్కడూ ఏ స్నేహితుడికైనా కనపడితే, "మీచెల్లెలు ఏదీ?" అని అడిగేవారట.

బీచి వెంబడే నడిచి వెళుతున్నాం. నీళ్ళలో నడుద్దామన్నాడు అన్నయ్య. 'పోనీ లే, చీర తడుస్తే యింటి కెళ్లి యింకొకటి కట్టుకో వచ్చు' నని నేనుకూడా నీటి అంచునే నడవటం ప్రారంభించాను. ఒక్కొక్క అల అంత ఎత్తున లేచి వచ్చి కాళ్ళకు తగులుతూంటే మహా ఆనందంగా వుంది. ఏం సముద్రం— అంతులేదు. ఎక్కడ చూసినా ఒక్కటే నీళ్ళమయం. ఉన్నట్లుండి అమాంతంగా ముంచుతా డన్నయ్య. భయం వేసింది. 'కెరటా లెంత బాగున్నాయి, అన్నయ్యా!' అన్నాను. 'అవు నమ్మా, చాలా బాగున్నాయి.' ఇంతలో ద్రాక్షపళ్లు అమ్మేవాడు వచ్చాడు. ఒక శేరు కొని 'ఇదిగో, పళ్ళు-తీసుకో' అన్నాను.

'వద్దు, జలుబు చేస్తుంది' అన్నాడు.

'ఆఁ, నీతో వస్తే యిదే. తీసుకో, తప్పదు.' అని చేతిలో పెట్టాను. 'తినవలసిందే! అయితే సరే. కాస్సేపు కూచుందామా!' సముద్రదృశ్యం చాలా రమ్యంగా వుంది. నాకూ కూచోవాలనిపించింది. పక్కపక్కనే కూర్చున్నాం. పళ్ళు తింటూ ప్రకృతి చూస్తున్నాం. నీళ్ళలో రంగు తేలి అరుణరాగంలా ఆకాశాన్ని ఆవరించినట్లుంది. సూర్యాస్తమయమైనట్టు గుర్తు కాబోలా అరుణరేఖ. మధ్యమధ్య పిల్ల మేఘాలు చాలా అందంగా వున్నాయి. నాలో కవిత్వమే లేదు. వూహాలు లేవు. చిత్రకారిణిని కాదు. ఇందులో ఏ లక్షణమున్నా ఆ దృశ్యాన్ని వదిలేదాన్ని కాదు.

చూస్తూచూస్తూ వుండగానే తెలిమబ్బులు కప్పాయి ఆకాశాన్ని. బీచిరోడ్డుమీద లైట్లు వెలిగాయి. చంద్రు డెప్పుడో ప్రవేశించా డాకాశాన్ని. నే నది గమనించనే లేదు.

'సరే పోదాం పద. సినిమా సగం అయిపోతుందేమో' అన్నాడు.

రోడ్డుమీద కెళ్లి నుంచోగానే టాక్సీవా డొచ్చాడు. ఇద్దరం ఎక్కాము. థియేటరుకు పోనీయమన్నాను. ఇంతవరకు అన్నయ్య ఏమీ మాట్లాడలేదు. టాక్సీ జోరుగా పోతున్నది. అన్నయ్య ముఖంమీద వెన్నెల. ఆ వెన్నెట్లో చూశాను-అన్నయ్య ఏడుస్తున్నాడు. ఏమిటో-ఎందుకో! ఇటువంటి మనుష్యులకు వాళ్ళకీ సుఖం లేదు, వాళ్ళవల్ల ఎదటివాళ్ళకూ సుఖంలేదు.

ఎందు కేడుస్తున్నట్లు - మనసు పిచ్చెత్తినట్లయింది నాకు. వెంటనే డ్రైవరుకు ఇంటి అడ్రసు చెప్పి అక్కడికి పోనియ్యమన్నాను. ఇంటిదగ్గర కొచ్చేశాం. దిగగానే 'ఏం, థియేటరుకు పోనీయలేదేం?' అన్నాడు డ్రైవరుతో. 'వద్దన్నారుగా?' అన్నాడు వాడు.

'ఏం సీతా, ఎందుకు వద్దన్నావమ్మా,?

'నాకు పోవాలని లేదు' అని చెప్పి టాక్సీకి డబ్బిచ్చేశాను. ఇద్దరం లోపలి కెళ్ళాం. మా నాన్న అప్పుడే భోజనానికి కూర్చున్నారు. 'సినిమా కెళ్ళలేదేం,?' అంది అమ్మ. 'బీచి కెళ్ళాం' అని మాత్రం చెప్పగలిగాను. అన్నయ్యా నేనూ అన్నానికి కూర్చున్నామన్న మాటేగాని, అన్నమే లోపలికి పోలేదు. త్వరగా ముగించి అన్నయ్య మేడమీదికి వెళ్ళాడు. నేనూ వెంట వెళ్ళాను. వాడు పుస్తకంతీసి చదవటం ప్రారంభించాడు. ఇద్దరికీ పక్కలేసి పడుకున్నానే కాని నాకు నిద్ర పట్టలేదు. కాస్సేపు అటూ యిటూ తిరిగాను. ఏం లాభం లేకపోయింది. అన్నయ్య పక్కగా నుంచుని పుస్తకంలోకి చూస్తున్నాను. ఉన్నట్లుండి పుస్తకంమీద ఒక నీటిబిందువు రాలింది.

'అన్నయ్యా'

'ఏం !'

'ఎందు కేడుస్తున్నావ్ చెప్పవూ' అన్నాను చేతులు పట్టుకుని.

'ఏం లేదమ్మా'

'నామీ దేమన్నా కోప మొచ్చిందా?'

'పిచ్చిపిల్లా, నీ మీ దెందుకూ కోపం?' అన్నాడు తల నిమురుతూ.

'మరి దేనికి?'

'నీ కర్థం కాదమ్మా, పోయిపడుకో.'

అన్నయ్య ఎవ్వరినైనా ప్రేమిస్తున్నాడేమో అనుకున్నాను. కాని అటువంటి లక్షణాలేమీ లేవు. నాకు తెలియకండా ఇంతవరకు ఏ పనీ చేయలేదు.

'ను వ్వెప్పుడూ దేన్నిగురించీ ఆలోచిస్తావు?'

'ఏమీ లేదమ్మా' అన్నాడు, లేచి కిటికీ చువ్వలు పట్టుకుని బయటికి చూస్తూ.

'ను వెప్పుడూ అలా వుండటం దేనికి?'

'...............'

'ఎవరినైనా ప్రేమిస్తున్నావా?' మెల్లగా అడిగాను.

'నీకు తెలియకుండానా!' అన్నాడు నవ్వుతూ. సగం కుదుటపడ్డాయి గుండెలు. అన్నయ్యకు నే నంటే ఎంత ప్రేమో తలుచుకుంటే—

'అయితే ఏమిటో ఆలోచించేది చెప్పవా?

'నాకే అర్థంకాదు, నీకేం చెప్పేది?'

'అయితే దాస్తున్నావా, పోనీలే.'

'నీ దగ్గర దాస్తానా?......సీతా, నీ కెప్పుడయినా జీవితమంటే ఏమిటన్న ఆలోచన తట్టిందా?'

'తెలుసుకుని ఏం చెయ్యటం?' అన్నాను.

ఇంక మాట్లాడలేదు. వచ్చి మంచంమీద పడుకున్నాడు. నేనూ పడుకున్నాను.

లేచేసరికి అన్నయ్య యింకా పక్కమీదనే వున్నాడు. ఆశ్చర్య మేసింది. అన్నయ్య ఎప్పుడూ యింత సేపటివరకూ పడుకోగా చూడలేదు. లేపుదామని దగ్గర కెళ్ళి మీద చెయ్యివేశాను. ఒళ్లు కాగిపోతున్నది. గబగబా క్రిందకి వెళ్లి-

'అమ్మా, అన్నయ్యకు జ్వర మొచ్చింది. ఒళ్లు కాగిపోతున్నది' అని చెప్పాను. అమ్మ పరుగెత్తుకుంటూ పైకి వచ్చింది.

అదే మొదలు. అన్నయ్య మళ్ళీ మంచం మీదనుంచి లేవలేదు. కూర్చున్నా, నుంచున్నా అన్నయ్యమాట గుర్తొచ్చేది. ఎప్పుడూ మంచం పక్కనే కూర్చునేదాన్ని. అన్నం, నీళ్ళు సహించేవి కావు. అదేం జబ్బో వస్తూనే నోరు పడేసింది. మాట్లాడలేదు. ఏం కావాలన్నా కళ్ళతోనూ, చేతుల్తోనే. కళ్ళు మూసుకుని ఒకటే కళ్ళ నీళ్ళు కార్చేవాడు. ఏం బాధో చెప్పగలిగితేనా-తలుచుకుంటే హృదయం చెదిరిపోతుంది.

తడిగావున్న కళ్ళు తడిగానేవుండేవి, అస్తమానం. నాకు ఆమంచమే లోకం అయింది.

ఇంతకీ అన్నయ్య మంచంమీద వున్నది మూడురోజులే. ఆ మూడురోజులూ అన్నం, నీళ్ళు లేవు మా యింట్లో ఎవ్వరికీ. కళ్ళలో వత్తులేసుకుని కూర్చున్నాం నేనూ, అమ్మా, నాన్నారు.

డాక్టర్లెంతోమంది వచ్చారు. కనపడ్డ డాక్టర్నల్లా పిలుచుకు వచ్చారు నాన్న. ఎన్ని మందులో పోశారు. ఎన్ని చేసినా అన్నయ్యకు నోరుమాత్రం రాలేదు. చిట్ట చివరికి చెల్లెలికి ఒక మాట చెప్పటానికి కూడా వీలులేకపోయింది.

మూడోరోజు రాత్రి వూరికే మూలగటం ప్రారంభించాడు - తలుచుకుంటే యిప్పటికీ గగుర్పొడుస్తుంది. ఏం బాధ పడ్డాడో - కన్నీళ్లు కార్చినవాడు కార్చినట్టే వున్నాడు. ఏమిటో కళ్ళు తిప్పి చూసేవాడు.

మా నాన్న ఆ మంచం మీదనే కూర్చున్నారు, దిగాలుపడి.

'ఏం, నాయనా, ఏం కావాలి?' అని అడిగింది అమ్మ. నోరుంటేనా మాటలు చెప్పటానికి!

'ఏమో, పిచ్చివాయన- త్వరగా నయమవుతే' అని పైకి చూసి నమస్కారం చేసింది అమ్మ.

ఉన్నట్టుండి తల అటూ, యిటూ తిప్పటం మొదలెట్టాడు అన్నయ్య. పట్టుకున్నా ఆగడు.

'ఏం నాన్నా, ఏం కావాలి?' అంటే అమ్మ, ఏం జవాబు చెప్పడు-అలాగే తల వూపుతాడు.

'ఏమండీ, యిలా చూడండి' అన్నది నాన్నను పిలిచి.

'ఏమిటీ చూసేది - యింకేముంది, తల విసురుడే - నాన్నా, ఎంతలోకి వచ్చిందిరా!' అని అన్నయ్య చేతులు పట్టుకున్నారు నాన్న.

'మీరు కూడా అలా అధైర్య పడితే ఎలా? మన ప్రయత్నం చెయ్యాలి కాని!' అనగానే మా నాన్న బయలుదేరారు అర్ధరాత్రి, డాక్టర్ని పిలుచుకు రావటానికి. డాక్టరొచ్చి చూశాడు. నాన్నను బయటకు పిలిచి ఏం చెప్పాడో ఏమో- వెంటనే కారు వేసుకొని వెళ్ళారు నాన్న. డాక్టరు అన్నయ్య పక్కన కూర్చుని పది నిమిషాలకొకసారి నాడి చూస్తున్నాడు. క్షణం ఒక యుగంలా వుంది నాకు. అరగంట అయిన తర్వాత నాన్న ఏదో సీసా తెచ్చారు. ఆయన్ని బయటికి తీసుకెళ్ళాడు డాక్టరు. ఏడుస్తూ వచ్చారు నాన్న.

'ఒద్దు- బయట పెట్టడకూ, నాన్నను! వాడింట్లో వాడిక్కూడా ఎవరికి?'

అమ్మకూడా ఏడుపు మొదలు పెట్టింది. ఏడుస్తూనే—

'పోనీ, యింకొక డాక్టర్ని పిలిచి చూపించకూడదా డాక్టరు గారూ' అన్నది.

'అలాగేనమ్మా చూపిస్తాను.' అని వెంటనే వెళ్ళాడాయన.

ఏడుపు ఎంత ఆపుకున్నా వుబికి వస్తున్నది. లేచి నుంచున్నాను బయటికెళ్దామని. అన్నయ్య నావైపే చూస్తున్నాడు. దగ్గర కెళ్ళి కూర్చున్నాను. మెల్లగా చేతివేళ్ళతో తాకాడు నా చెయ్యిని. అంతే - కళ్ళు మూతలు పడ్డాయి. అదే - ఆఖరిచూపు.

మరునాడు పదిగంటల కల్లా అన్నయ్య రూపు లేకుండా పోయింది. ఎక్కడ చూసినా అన్నయ్య ఆలోచిస్తూ అగుపించేవాడు. బ్రతికి వున్నన్నాళ్లూ చక్కగా సంతోషంగా గడిపిన రోజులు పట్టుమని పదికూడా వుండవేమో- తను సంతోషపడలేక పోయాడు. ఎందుకని తన జీవితాన్నంతా ఆలోచనతో విచారమయంగా చేసుకున్నట్లు! బహుశా తన సమాధి చూసినప్పుడల్లా చెల్లెలు విడిచే ఈ రెండు అశ్రుకణాలకేనేమో!

లెక్చరర్:—(క్లాసులో) సూదిమొనమీద కొన్నిలక్షల సూక్ష్మక్రిములు బ్రతక గలవు.

విద్యార్థి:—ఎంత మంచి ఆహారం!